లేబర్ కార్డు దారులకు ఉచిత వైద్య శిబిరం



అడ్డగుట్టలోని ఐద్వా కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: లేబర్ కార్డు ఉన్న కార్మికులకులందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం నాయకులు అజయ్‌బాబు సూచించారు. శుక్రవారం అడ్డగుట్టలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యాలయంలో లేబర్ డిపార్టమెంట్ తరుపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, థైరాయిడ్‌లతో పాటు యూరినల్ సమస్యలు, విటమిన్ లోపం సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం, అవసరమైన వారికి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన సీపీఎం నాయకులు అజయ్ బాబు మాట్లాడుతూ లేబర్ కార్డు ఉన్నవారందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కార్డు లేని వారు కూడా వెంటనే లేబర్ కార్డు చేయించుకోవాలని సూచించారు. వచ్చే వారం కూడా లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కిషోర్, సిబ్బంది విజయ్ రాజు, అనుపమ, సంఘం సభ్యులు అంజమ్మ, ఫాతిమ, స్వరూప, రాజన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగణేశ్‌కు పలువురి అభినందన



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను అభినందిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ
మైనారిటీ నేతల సత్కారం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, పార్టీ నేత రోహిన్‌రెడ్డిలతో పాటు శ్రీగణేశ్, దీపాదాస్ మున్సీని కలిశారు. ఈ సందర్భంగా ఆమె శ్రీగణేశ్‌ను అభినందిస్తూ, గ్రేటర్ పరిధిలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలవడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో గ్రేటర్ పరిధిలోనూ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా నేతలంతా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు దిశగా పాటుపడాలని శ్రీగణేశ్‌కు సూచించారు. అంతకు ముందు గాంధీభవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను, ఎమ్మెల్యే శ్రీగణేశ్ కలిశారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీగణేశ్‌ను కార్ఖానాలోనిజ ముస్లిం మైనారిటీలు ఘనంగా సత్కరించారు. కార్ఖానాలో మీర్జా, అశ్రఫల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన కలిగిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: భద్రతే జీవితానికి నేస్తమని, అది లేకుంటే జీవితమే అస్తవ్యస్తమవుతుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. టీటీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సింజెంటా ఇండియా లిమిటెడ్ కంపెనీ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు–నివారణ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ మాట్లాడుతూ సిగ్నల్ పడ్డప్పుడు ఆగే ఓపిక కూడా కొందరు వాహనదారులకు లేకుండా పోతుండడం బాధాకరమన్నారు. తొందరంగా వెళ్లాలనే ఆత్రమే ఇలాంటి రోడ్డు ప్రమాదాలకు కారణమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఇలా నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలకు కారణమై బాధిత కుటుంబాలకు తీరని శోకాన్ని మిగల్చకండని సూచించారు.

ఈఎస్ఐ మెడికల్ కళాశాలలో..

టీటీఐ ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఈఎస్ఐ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ విద్యార్థులకు, సిబ్బందికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగించారు. ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, వాటి వల్ల కలిగే అనర్థాలు, జరిమానాల వివరాలను ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు

బౌద్ధనగర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించ తలపెట్టిన ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పార్శిగుట్ట న్యూ అశోక్ నగర్లోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తి అవుతున్న సందర్భంగా 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని జులై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతును నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కవాతుకు హైద్రాబాద్ జిల్లాలోని ప్రతీ మాదిగ బస్తీ నుండి పెద్ద ఎత్తున యువకులు, అదే విధంగా మాదిగ విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మురుగు నీటితో జనం అవస్థలు

వాటర్‌వర్క్స్ కార్యాలయం ముందు కోటనీలిమ ధర్నా



సనత్‌నగర్: బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీలో మురుగునీరు పొంగిపొర్లడంపై కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ కార్యదర్శి కోట నీలిమ ప్రకాష్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ మోకాలు లోతు వరకు మురుగునీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే ఎస్‌బీటీనగర్‌లో కలుషిత నీటి సరఫరా అవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోటనీలిమ అధికార పార్టీలో ఉండి ధర్నాకు దిగడంపై కాంగ్రెస్ నాయకులు విస్తుపోతున్నారు. అధికార పార్టీలో ఉన్న ఆమె అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చేయడమో లేక నేరుగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారం జరిగేలా చూడడమో చేయవచ్చు.. కానీ ఆమె నేరుగా ధర్నాకు దిగి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించడమేమిటని పట్ల పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

మాన్సూన్ టీమ్‌లు వచ్చేశాయ్



వరదనీటిని తొలగిస్తున్న మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్

సనత్‌నగర్: చినుకుపడుతుంటే లోతట్టు ప్రాంత ప్రజల గుండెలు గుభేల్‌మంటున్నాయి. ముఖ్యంగా ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు నాలా పరివాహక ప్రాంత కాలనీ నివాసితుల కంటిపై కునుకు లేకుండా చేస్తాయి. గతంలో వరదలు ముంచెత్తిన పలు సందర్భాల్లో తమకు ఎదురైన చేదు అనుభవాలే ఇంకా కళ్లముందు మెదులుతూనే ఉన్నాయి. అయితే ముంపు గురించి భయపడవద్దని, ఎప్పటికప్పుడు తాము అలెర్ట్‌గా ఉంటూ నీటిని బస్తీలు, కాలనీల నుంచి బయటకు తరలించడమే తమ పనిగా పెట్టుకున్నట్లు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయి. ఔను..వర్షం వస్తే అందరూ ఎక్కడివారు అక్కడే ఉండిపోతారు. కానీ వారు మాత్రం తటాకాలను తలపించే రోడ్ల పైకి వచ్చేసి నీటిని తొలగించే ప్రక్రియలో తలమునకలవుతారు.

- సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రధానంగా అమీర్‌పేట, బేగంపేట నాలా పరివాహక ప్రాంతాల్లో వరద ముంపు ప్రభావం ఎక్కువ ఉంటుంది. నాలా పరివాహక ప్రాంతాలైన మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్లతో పాటు అమీర్‌పేట డివిజన్‌లో అంకమ్మబస్తీ, హరిజనబస్తీ, గంగుబాయిబస్తీ, బుద్ధనగర్, లీలానగర్ బస్తీలు వరద ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అదేవిధంగా బేగంపేట సర్కిల్ పరిధిలోని మెక్లెన్‌గూడ, నల్లగుట్ట, బాపుబాగ్ కాలనీ, లాలా టెంపుల్, సెయింట్ మేరీస్ రోడ్డు, రాణిగంజ్, కర్బలా మైదానం, ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం వద్ద తదితర ప్రాంతాల్లో ఎక్కువగా నీరు నిలుస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడడం నిత్యకృత్యంగా మారింది.
- వర్షం పడుతున్న ప్రతిసారీ డివిజన్ల వారీగా కేటాయించిన ప్రత్యేక మన్సూన్ బందాలు రంగంలోకి దిగి ఎప్పటికప్పుడు వరద నీటిని తొలగిస్తున్నారు.

ఒక్కో బృందంలో ఆరు నుంచి 10 మంది..

సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, మోండా డివిజన్‌లలో ఒకటి చొప్పున మాన్సూన్ బృందాలు విధుల్లో కొనసాగుతున్నాయి. డివిజన్లలో వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను బట్టి బృందంలో సభ్యుల సంఖ్యను కేటాయించారు. ఒక్కో బందంలో ఆరు నుంచి 10 మంది చొప్పున నియమించారు. వీరికి ఒక వాహనంతో పాటు వరదనీటి తొలగించేందుకు ఉపయోగించే పరికరాలు అందుబాటులో ఉంటాయి.

- ఒక్కో షిఫ్టునకు ఎనిమిది గంటల చొప్పున రోజుకు మూడు షిఫ్టుల్లో 18 బృందాల ద్వారా సుమారు వంద మంది సిబ్బంది అత్యవసర విధులను నిర్వర్తిస్తున్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ..

వర్షం పడుతుందంటే అత్యవసర బృందాలు అప్రమత్తమవుతాయి. నీరు నిలిచే రహదారులు, బస్తీల్లోకి ఈ బృందాల సభ్యులు చేరుకుంటారు. నీరు నిలవకుండా చేయడం, మ్యాన్‌హోళ్లను ఎత్తి నీటి ప్రవాహాన్ని తగ్గించడంపై దృష్టి పెడతారు. కూలిన చెట్లను, కొమ్మలను తొలగించడంతో పాటు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడతారు.

- వీటితో పాటు వర్షాలకు పాడైన రహదారులకు తక్షణ మరమ్మతులు చేయడం, రహదారుల పైకి కొట్టుకువచ్చిన మట్టి, బురద, ఇసుక తొలగించడం, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్‌లకు అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించడం చేశారు. ఔట్‌లెట్ల వద్ద నీరు పొంగిపొర్లకుండా వ్యర్థాలను తొలగించడం చేస్తుంటారు.

డివిజన్ల వారీగా బృంద పర్యవేక్షకుల నెంబర్లు..

డివిజన్	ఏఈ	ఫోన్‌నెంబర్
సనత్‌నగర్	సాయిసందీప్	79950 09096
అమీర్‌పేట డివిజన్లు		
బేగంపేట	తిరుమలయ్య	73311 89517
మోండా	రవీందర్	77995 30053
రాంగోపాల్‌పేట	శివరామ్‌ప్రసాద్	73375 57267
బన్సీలాల్‌పేట	నవీన్	77950 09099

నిరంతర పర్యవేక్షణ

వర్షాకాలంలో ప్రజలకు ఆటంకాన్ని కలిగించే వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు మన్సూన్ టీమ్‌లు 24 గంటల పాటూ సిద్ధంగా ఉన్నాయి. తామంతా అప్రమత్తంగా ఉంటూనే వారిని అప్రమత్తం చేస్తూ నిరంతర పర్యవేక్షణ జరుపుతున్నాం. ముఖ్యంగా వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టిసారించాం.

– బేగంపేట సర్కిల్ ఈఈ సుదర్శన్..

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.47, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 28, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఎంఎంటీఎస్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. బొల్లారం – కెవలరీ బ్యారక్స్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని అల్వాల్ హాల్ట్ స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


యువకుడి అదృశ్యం



డి.ప్రకాష్

కాచిగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి.రవికుమార్ సమాచారం మేరకు... బర్కత్‌పురాలోని రుక్కుస్ యెల్లు ఆర్కెడ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న డి.రమ కుమారుడు డి.ప్రకాష్ (24) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో, తెలిసిన వారి ఇండ్లలో ఎంత వెదికినా ఆచూకి లభించలేదు. దీంతో తల్లి రమా కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



సబావత్ రూక్‌లాల్

కాచిగూడ: వాకింగ్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి.రవికుమార్ సమాచారం మేరకు... నెహ్రూనగర్‌కు చెందిన చంద్రు కుమారుడు సభావత్ రూక్‌లాల్(60) గురువారం రాత్రి ఇంట్లో నుంచి వాకింగ్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించనందున అతని భార్య శాంతమ్మ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి: అఖిల బ్రాహ్మణ సమాభివృద్ధి సంస్థ (ఏబీసీడీఓ) చిక్కడపల్లి ఆధ్వర్యంలో శ్రీధ్రువివాహాల కోసం కన్యా పరపాశుపత హోమాలు, 82వ బ్రాహ్మణ ఉచిత మెగా వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎస్.సుబ్రమణ్యం తెలిపారు. ఈ నెల 23న (ఆదివారం) న్యూనల్లకుంటలోని సహకార గృహ నిర్మాణ సంస్థ కమ్యూనిటీ హాల్‌లో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తామన్నారు. జంటనగరాల్లో 50 వంసతాలుగా సేవలు అందిస్తున్న ఏకైక బ్రాహ్మణ సేవా సంస్థ అయిన ఏబీసీడీఓ నిర్వహించే ఈ కార్యక్రమాల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలను ఫోన్స్: 93906 46539, 91004 14469, 94928 66204లలో సంప్రందిచాలన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించాలి

కాచిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్ల నిధులను మంజూరు చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొండ దేవయ్య నేతృత్వంలో శుక్రవారం మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు. జిల్లాల్లో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాల ఏర్పాటు కోసం కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రూ. 5 కోట్లు నిధులు, రెండు ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

భక్తి, సంప్రదాయ కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో భక్తి, సంప్రదాయ కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో సాయంత్రం 5.30 గంటల నుంచి మొదటి బ్యాచ్, ప్రతి మంగళ, శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. ఇందులో అన్నమయ్య కీర్తనలు, సాయిబాబా భక్తి గీతాలు, శివ శక్తి, రామ భక్తి గీతాలు, పెళ్లి పాటలు, మంగళ హారతుల పాటల్లో శిక్షణ ఉంటుందన్నారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి స్వీయ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని చెప్పారు. వయోపరిమితి లేదని తెలిపారు. వివరాలను ఫోన్: 83749 27736లో సంప్రదించాలన్నారు.

చట్టవిరుద్ధ గోవధ శాలలను తక్షణమే మూసివేయాలి

కవాడిగూడ: రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణమే మూసివేసి ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేసి అక్రమణలో ఉన్న గోచర భూములకు విముక్తి కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గోరక్ష చట్టాలు అమలు చేయాలని, గో హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్కు వద్ద దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి, గోరక్ష విభాగం, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో గో మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో స్వామి కమలానంద భారతి, ఆలిండియా మత్ మందిర్ అధ్యక్షుడు రామరాజు, విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, కన్వీనర్ శివరాం, తెలంగాణ రాష్ట్ర గో ప్రముఖ్ ఇనంపల్లి వెంకన్న, గో రక్ష సహ ప్రముఖ్ జి. రమేష్, బాలకృష్ణ గురుస్వామిలు మాట్లాడుతూ... దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలలో గోశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందించాలన్నారు. నగరంలోని బోరబండ, నార్సింగి తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. గోవధ నిషేధంపై తెలంగాణ హైకోర్టు అర్డర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ధర్నాలో రావినూతన శశిధర్, ఆకుతోట రామారావు, సుభాష్, పండరీనాథ్, డాక్టర్ శ్రీనివాస్, పలువురు స్వామిజీలు, గో ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దళిత ముస్లిం, క్రైస్తవులకు షెడ్యూల్ కులాల హోదా ఇవ్వాలి

లాలాపేట: దళిత ముస్లిం, క్రైస్తవులకు షెడ్యూల్ కులాల హోదా ఇచ్చి కుల గణన చేపట్టాలని తెలంగాణ దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయమై సీఎం కార్యాలయానికి, బీసీ కమిషన్‌కు లేఖలను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. దళిత బుద్దిస్ట్ సిక్కు మతస్తులకు షెడ్యూల్ కులాల హోదా ఇచ్చి వారి మత హక్కును, కుల రిజర్వేషన్లు పరిరక్షించిన విధంగానే దళిత ముస్లిం, క్రైస్తవులకు షెడ్యూల్ హోదా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ మేరకు అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు.

ఇద్దరు మైనర్లను చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు మైనర్లను ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి హోంకు తరలించారు. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన మేరకు.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లికేష్(16) హద్మ(17) అనే ఇద్దరు మైనర్లు గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు ఎస్ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రాధారాణి, వైశాలిలు అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే, వారిద్దరూ ఛత్తీస్‌గఢ్ నుంచి పారిపోయి వచ్చినట్లు చెప్పడంతో చైల్డ్ వేల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఆదేశాల మేరకు ఇద్దరు మైనర్లను సైదాబాద్‌లోని హోంకు తరలించారు.

రోడ్లకు మరమ్మతులు



గుంతలకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి లాలాపేటలోని పలు బస్తీ, కాలనీల్లో రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్న వైనాన్ని సాక్షి దినపత్రికలో గత నెల 31న 'రోడ్లపై గుంతలు...అధికారుల కళ్లకు గంతలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం లాలాపేట బస్తీల్లోని రోడ్లపై ఏర్పడి గుంతలకు మరమ్మతులు చేశారు.

రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధి

ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని భువనగిరి ఎంపీగా విజయం సాధించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ కో ఆర్డినేటర్ ముషీరాబాద్‌కు చెందిన గండి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి శాలువాలు కప్పి మెమెంటోతో అందజేసి సన్మానించారు. పార్టీ నాయకులు మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మనెంట్ చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎల్ పద్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇఫ్టు అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్టు అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో వివిధ హాస్టల్స్‌లో పర్యటించిన ఆమె మాట్లాడుతూ 1992 నుంచి హాస్టల్స్, కార్యాలయాలు, కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు తక్కువ వేతనం చెల్లిస్తు శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా ఉద్యోగాల వేతనాలను పెంచి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, లక్ష్మీ, శివ, వెంకటేష్, విజయ, సుజాత, వనజ, ఆర్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రమాదాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తం

హిమాయత్‌నగర్: హైదరాబాద్ మహానగరంలో వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తమయింది. నగరంలో తరుచూ వస్తున్న భారీ వర్షాలు, వరదలు నీటి ముంపు వలన ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తినష్టం జరుగుతున్నందున ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ప్రమాదం జరిగినప్పుడు ఏమి చేయాలి అనే విషయాలపై ఒక రోజు ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జూన్ 10 తేదీన జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫత్తుల్లగూడ, నాగోల్ ట్రైనింగ్ సెంటర్ వర్షాకాలపు ప్రమాదాల గురించి అవగాహన, సమాచారం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగం వారు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ట్రైనింగ్ లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారు. సోమవారం తరువాత కూడా ఆసక్తి ఉన్న వారు సంప్రదిస్తే ఈ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తారు. ఆర్‌డబ్ల్యుఎంలలో అపార్ట్‌మెంట్‌లలో పని చేసే సిబ్బంది, బస్తీల్లో నివసించే ప్రజలు, ఎన్‌జీవో సభ్యులు, ట్రేడ్ యూనియన్ సభ్యులు, ఇతరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవటం చాలా అవసరమన్నారు. వివరాలకు ఎస్ఎఫ్ఓ శ్యాంసుందర్ రెడ్డిని ఫోన్: 79817 75687 ద్వారా సంప్రదించాలని తెలియజేశారు.